సాక్షి ఒడిశా
శుక్రవారం । 4 । అక్టోబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,94,375లు, బంగారం 1 గాముల 190 మిల్లీగ్రాములు వెండి 70 గ్రాముల 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



షూలో దూరి.. కాటువేసి

షూలో దూరిన విషసర్పం కాటువేసిన ఘటన స్థానిక చౌకైసియాని ప్రాంతంలో గురువారం చోటు చేసుకుంది

- 8లో



పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

బీజేడీ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు పిలుపునిచ్చారు.

- 8లో

న్యూస్‌రీల్

బాధ్యతల స్వీకరణ



భువనేశ్వర్: నగర కొత్త డీసీపీగా పినాక్ మిశ్రా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన గౌరవ వందనం అందుకున్నారు.

రక్తదాన శిబిరం



రక్తదానంలో పాల్గొన్న యువకులు

రాయగడ: సదరు సమితి పెంట పంచాయతీలోని ఆదర్శ విద్యాలయంలో జాతీయ సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. దీనిలో భాగంగా 51 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. సంస్థ అధికారి డాక్టర్ సునీల్ కుమార్ బిసాయి నేతృత్వంలో జరిగిన శిబిరంలో యువకులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. యువత రక్తదానంపై అవగాహన కలిగి ఉండాలని, ఆపదలో ఉన్నవారిని ఆదుకునే సేవా గుణం కలిగి ఉండాలని డా.బిసాయి అన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మృతదేహం

రాయగడ: స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానం సమీపంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. మృతుడికి 60 ఏళ్లకు పైగా ఉంటాయని భావిస్తున్నారు.

దివంగత మంత్రి పీఎస్‌వో బర్తరఫ్



మిత్రభాను దేవ్

భువనేశ్వర్: దివంగత మంత్రి నవ కిషోర్ దాస్ వ్యక్తిగత అంగ రక్షకుడు(పీఎస్‌వో) మిత్ర భాను దేవ్‌ని ఉద్యోగం నుంచి బర్తరఫ్ చేశారు. గతేడాది జనవరి 30వ తేదీన అప్పటి రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి నవ కిషోర్ దాస్ దారుణ హత్యకు గురయ్యారు. ఝార్సుగుడ జిల్లా బ్రజ్‌రాజ్ నగర్ ఠాణా గాంధీ చక్ ప్రాంతంలో ఈ ఘోర ఘటన చోటు చేసుకుంది. గాంధీ ఛక్ ఔటు పోస్టు ఏఎస్‌ఐ గోపాల చంద్రదాస్ మంత్రికి పిస్తోలు గురిపెట్టి పేల్చడంతో హత్యకు గురైనట్లు ఆరోపణ. ఈ సంఘటనపై కొనసాగిన విచారణ ఆధారంగా అంగ రక్షకునిగా బాధ్యతలు నిర్వహించిన మిత్రభాను దేవ్‌ని ఉద్యోగం నుంచి బర్తరఫ్ చేసినట్లు గురువారం ప్రకటించారు. లోగడ ఆయనకు విధుల నుంచి సస్పెండు చేశారు.

భారీగా గంజాయి స్వాధీనం



కారులో గంజాయితో పట్టుబడిన నిందితులు

జయపురం: బొయిపరిగుడ ప్రాంతం నుంచి నవరంగపూర్ జిల్లా రాయిఘర్ ప్రాంతానికి ఒక కారులో తరలిస్తున్న గంజాయిని పట్టుకున్నట్లు జయపురం పట్టణ పోలీసు అధికారి రమణీ రంజన్ దొళాయి వెల్లడించాయి. దీనిలో భాగంగా ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. అరెస్టైనవారిలో నవరంగపూర్ జిల్లా ఉమ్మరకోట్ బొడొకుమారి ఎంపీ 2 గ్రామానికి చెందిన ప్రత్యూష మండల్, రాయిఘర్ సమితి గంజాపర కుసుంపూర్ గ్రామానికి అరవింద రాయ్ ఉన్నట్లు తెలిపారు. పట్టుబడిన గంజాయి తూయించగా 53.500 కేజీలు ఉందని, దీని విలువ రూ.5.30 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. సబ్ ఇన్‌స్పెక్టర్ సిద్ధాంత కుమార్ బెహర నేతృత్వంలో పెట్రోలింగ్‌లో భాగంగా జయపురం పట్టణ భూతనాశ శ్మశానం సమీపంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో బొయిపరిగుడ మార్గంలో ఒక కారుని ఆపి సోదాలు నిర్వహించారు. దీంతో కారులో గంజాయి పట్టుబడింది. వెంటనే కారుతో పాటు వారిని స్టేషన్‌కు తీసుకొచ్చి మేజిస్ట్రేట్ సమక్షంలో తూయించామన్నారు. నిందితులను విచారించగా బొయిపరిగుడ సమితి భెలువపాదర్ ప్రాంతం నుంచి గంజాయి కొనుగోలు చేసి రాయిఘర్ తీసుకెళ్తున్నట్లు వెల్లడించారన్నారు.

అమ్మ ఆగమనం..!



ప్రారంభమైన శరన్నవరాత్రులు



పర్లాకిమిడి: శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు

దేవీ నవరాత్రులు గురువారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారు 9 రోజుల పాటు రోజుకో స్వరూపంలో పూజలందుకొని మానవాళికి వరాలు ప్రసాదించి కొంగు బంగారంగా కటాక్షిస్తుంది. నవరాత్రి ఉత్సవాలు తొలిరోజున దేవీ శైలపుత్రిగా పూజలందుకుని భక్త జనులను తరింపజేసింది. నవరాత్రి ఉత్సవాల్లో నవ రూపాల్లో దేవీ పూజలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇదే తరహాలో రోజుకో వర్ణం (రంగు) ప్రాధాన్యత కలిగి ఉండడం విశేషం. భక్తజన హృదయాల్లో కదిలాడే దివ్య మనోహర అలంకరణ దేవీ ప్రత్యక్షతకు అద్దం పడుతుంది. ప్రతిపద నుంచి నవమి వరకు నవ రూపాల్లో దేవీ దర్శనం పొందుతూ, అత్యంత నియమనిష్ఠలతో పూజలు చేసిన భక్తులు దశమి నాడు ఈ పూజని శాస్త్రోక్తంగా ముగిస్తారు. విజయ దశమి రోజున జనులంతా వేడుకగా దేవీ పూజల్లో భక్తిశ్రద్ధలతో పాలుపంచుకుంటారు.

- సాక్షి నెట్‌వర్క్



పర్లాకిమిడి: పట్టణంలోని త్రిపురాన గిరిజా ఇంట్లో బొమ్మల కొలువు



కొరాపుట్: విద్యుత్ వెలుగుల్లో నబరంగ్‌పూర్ బండారు ఘరణి శక్తి పీఠం



కొరాపుట్: రాజ ఖడ్గంకి ప్రత్యేక పూజలు



రాయగడ: ప్రత్యేక అలంకరణలో మజ్జిగౌరి అమ్మవారు



మల్కన్‌గిరి: పూజలందుకోవడానికి సిద్ధమైన అమ్మవారు



భువనేశ్వర్: శైల పుత్రిగా పూజలు అందుకున్న దేవీదుర్గ



జయపురం: పూజలందుకుంటున్న అమ్మవారు



రాయగడ: రాజ్యలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు

పెట్టుబడులకు ఒడిశా అనుకూలం



విదేశీ రాయబారుల సమావేశంలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి తదితరులు




సన్నాహక సమావేశంలో పాల్గొన్న విదేశీ రాయబారులు

- సీఎం మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: రాష్ట్ర పారిశ్రామిక రంగం విస్తరణకు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి భారీ సన్నాహాలు చేస్తున్నారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు పెట్టుబడులను ఆకట్టుకునేందుకు పలు దేశాల రాయబారులతో ఆయన గురువారం సమావేశమయ్యారు. న్యూఢిల్లీలో జరిగిన ఈ సమావేశంలో 34 దేశాల రాయబారులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి మాట్లాడుతూ.. పారిశ్రామిక పెట్టుబడులకు ఒడిశా అనుకూలమైనదిగా వివరించారు. రాష్ట్రంలో పారిశ్రామిక అనుకూల వాతావరణంపై ప్రత్యక్ష అవగాహన కల్పించేందుకు ఎక్సలెన్సు ఒడిశా పారిశ్రామిక కాంక్లేవ్ - 2025 నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. రానున్న రోజుల్లో ఒడిశా అతిపెద్ద పారిశ్రామిక హబ్‌గా వెలుగొందుతుందని పేర్కొన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 2047 సంవత్సరం నాటికి వందేళ్లు అవుతుందని, అప్పటికి దేశ పురోగతిలో ఒడిశా సింహభాగం భాగస్వామ్యం కలిగి ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రీన్ ఫ్యూయెల్, ఆహార ఉత్పాదన, ఎలక్ట్రానిక్స్, సాంకేతిక సమాచారం, సెమీ కండక్టర్లు, పెట్రో కెమికల్స్ ఇతరేతర రంగాల్లో భారీ పెట్టుబడులతో ఉన్నత స్థాయి పరిశ్రమల ఏర్పాటు దిశలో ఒడిశా వ్యూహాత్మక పారిశ్రామిక విస్తరణ కార్యాచరణతో నిరంతరం కృషి చేస్తుందన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి, పరిశ్రమల శాఖ మంత్రి, అనుబంధ శాఖల ప్రముఖ కార్యదర్శులు పాల్గొన్నారు.

చిరుతల గణన నివేదిక వెల్లడి







కెమెరా ట్రాపింగ్‌లో చిరుతల సంచారం

భువనేశ్వర్: రాష్ట్రంలో తొలిసారిగా చిరుత పులుల సంతతిని లెక్కించారు. ఈ మేరకు ఇటీవల అనుబంధ సిబ్బంది, యంత్రాంగానికి కెమెరా ట్రాపింగు ఇతరేతర రంగాల్లో ప్రత్యేక శిక్షణ కల్పించారు. రాష్ట్ర అటవీ శాఖ స్వతంత్రంగా ఈ లెక్కింపు చేపట్టింది. ఈ లెక్కింపులో రాష్ట్రంలో సమగ్రంగా 696 చిరుతు పులులు ఉన్నట్లు వెల్లడించారు. పులుల సంచార ప్రాంతాల్లో కెమెరా ట్రాపింగ్, పాదముద్రలు వంటి విధానాలతో ఈ ప్రక్రియ నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో వేర్వేరు చోట్ల 284 కెమెరాలను అమర్చారు. పులుల సంతతి పరిరక్షణ ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర అటవీ శాఖ ఈ సన్నాహానికి నడుం బిగించడం విశేషం. 2022 సంవత్సరంలో జాతీయ పులుల సంరక్షణ వర్గం(ఎన్‌టీసీఏ) రాష్ట్రంలో పులుల సంతతి లెక్కింపు నిర్వహించింది. ఈ గణనలో రాష్ట్రంలో 568 పులులు ఉన్నట్లు తేల్చింది. అంతకు ముందు 2018 సంవత్సరంలో నిర్వహించిన లెక్కల్లో 760 పులులు రాష్ట్రంలో సంచరిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ఏడాది తొలిసారిగా రాష్ట్ర అటవీ శాఖ చిరుత పులుల సంతతిని లెక్కించి విశ్వసనీయ గణాంకాలను వెల్లడించిందని భావిస్తున్నారు. తాజా గణాంకాల ప్రకారం రాష్ట్రంలో సాధారణ చిరుత పులులతో నల్ల చిరుత పులులు కూడా సంచరిస్తున్నట్లు గుర్తించారు.


పొగాకు విముక్తి అభిజాన్



పొగాకుపై పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పట్వారి తదితరులు

రాయగడ: జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రాస్పత్రిలో పొగాకు విముక్తి అభిజాన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కలెక్టర్ ఫరూల్ పట్వారీ ముఖ్య అతిథిగా హాజరై పోగాకు వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు గురించి వివరించారు. అనంతరం ప్రజలకు అవగాహన కలిగేలా పోస్టర్లను ఆవిష్కరించారు. మత్తుకు యువత బానిసై తమ బంగారు భవిష్యత్‌ను బుగ్గిపాలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమ సమాజ నిర్మాణానికి యువత కీలకమని హితవు పలికారు. కార్యక్రమంలో జిల్లా ముఖ్య వైద్యాధికారి డాక్టర్ లాల్ మోహన్ రౌత్రాయ్, ఏఎస్పీ భీమ సేన్ నాయక్, ఏడీఎం పబ్లిక్ హెల్త్ డాక్టర్ మమత సాహు, డాక్టర్ ప్రదీప్ కుమార్ సుబుద్ధి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు మనోజ్ కుమార్



జయపురం: సబ్ డివిజన్ పరిధి కుంద్రలోని బిజూ పట్నాయక్ కళాశాలలో చదువుతున్న విద్యార్థి మోహన్ కుమార్ మద్కామి జాతీయ స్థాయి విలు విద్య పోటీలో పాల్గొనున్నాడు. నవంబర్ 11వ తేదీన గుజరాత్ వేదికగా జరగనున్న విలు విద్య పోటీల్లో ఒడిశాకు మద్కామి ప్రాతినిధ్యం వహించనున్నారు. సెప్టెంబర్ 30వ తేదీన భువనేశ్వర్ కిష్ ఉన్నత మాధ్యమిక పాఠశాల ప్రాంగణంలో జరిగిన రాష్ట్రస్థాయి విలు విద్య పోటీల్లో సత్తాచాటి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. దీంతో అతడికి పలువురు అభినందనలు తెలిపారు.

నిరుద్యోగుల జ్వాలలు



కటక్ నగరంలో నిరసనకారుల ర్యాలీ



నిరుద్యోగుల నిరసన

- మంత్రి నివాసం ముట్టడికి విఫలయత్నం

భువనేశ్వర్: ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో అక్రమాలు నిరుద్యోగ యువతని వేధిస్తున్నాయి. ఈ వేధింపులపై ప్రభుత్వ యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తుందని తీవ్ర ఆవేదనతో వారంతా నగరంలోని రాష్ట్రమంత్రి సూర్య వంశీ సూరజ్ నివాసం ముట్టడించేందుకు గురువారం ఉద్యమించారు. మరోవైపు కటక్ నగరంలో నేతాజీ బస్సు టెర్మినల్ నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఇటీవల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్‌ఐ), ఏఆర్‌ఐ, ఐసీడీఎస్ సూపరువైజర్లు, ఎస్‌ఎఫ్‌ఎస్, అమీన్ పోస్టుల భర్తీకి ఒడిశా సబ్ ఆర్డినేటు స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ (ఓఎస్‌ఎస్‌ఎస్‌సీ) నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో 2,895 పోస్టుల భర్తీకి సెప్టెంబర్ 20 నుంచి అక్టోబర్ 20వ తేదీ వరకు ప్రాథమిక రాత పరీక్షలు జరుగుతాయని ప్రకటించింది. ఈ పరీక్షలు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తుంది. ఈ క్రమంలో ఊహాతీతమైన అక్రమాలు వెలుగు చూసినట్లు ఔత్సాహిక అభ్యర్థుల వర్గం బాహాటంగా ఆరోపించింది. ఆన్‌లైన్‌లో పరీక్షల నిర్వహణ వెసులుబాటు ఉండడంతో సైబర్ కేఫేల్లో రాత పరీక్షలు కొనసాగిస్తున్నారు. దీనిపై ఎటువంటి నిఘా లేకపోవడంతో భారీ అవక తవకలు చోటు చేసుకుంటాయని, తక్షణమే ఈ అక్రమానికి కళ్లెం వేసేందుకు ఆన్‌లైన్ పరీక్షల విధానం రద్దు చేసి, ఆఫ్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించాలని యువతరం ఆందోళనకు దిగింది. వీరి ఆందోళనతో స్థానిక నయాపల్లి ప్రాంతంలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. వీరంతా రాష్ట్ర మంత్రి సూర్య వంశి సూరజ్ నివాస భవనం ముట్టడించేందుకు దూకుడు ప్రదర్శించారు. సకాలంలో పోలీసులు చొరవ కల్పించుకుని నిరసనకారుల్ని చెదరగొట్టారు. ఇటీవల ఓఎస్‌ఎస్‌ఎస్‌సీ నిర్వహించిన ఫారెస్టర్, ఎల్‌ఐ పోస్టుల భర్తీ ప్రక్రియలో అక్రమాలకు పాల్పడినట్లు ఈ సందర్భంగా గుర్తు చేశారు.



మంత్రి నివాసం వద్ద నిరుద్యోగ యువత



మంత్రి నివాసం ముట్టడిని అడ్డుకుంటున్న పోలీసు అధికారి

మర్యాదపూర్వక భేటీ





స్థానిక రాజ్ భవన్‌లో రాష్ట్ర గవర్నర్ రఘుబర దాస్‌తో ప్రముఖులు గురువారం భేటీ అయ్యారు. వీరంతా సౌజన్యాత్మకంగా భేటీ అయినట్లు తెలిపారు. గవర్నర్‌తో భేటీ అయిన వారిలో స్థానిక రమాదేవి మహిళా విశ్వ విద్యాలయం వీసీ ప్రొఫెసర్ అపరాజిత చౌదరి, ఒడిశా రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ జల్దా కుమార్ త్రిపాఠి ఉన్నారు.

- భువనేశ్వర్:

క్లుప్తంగా

ఎస్పీగా వినోద్ పటేల్



మల్కన్‌గిరి: జిల్లా నూతన ఎస్పీగా వినోద్ పటేల్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో శాంతి భద్రతలు కాపాడేందుకు అందరి సహకారంతో కృషి చేస్తానన్నారు.

చెరువులో మునిగి మహిళ మృతి



చెరువు నుంచి బయటకు తీసిన మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి దలపతి గూడ పంచాయతీ ఒడియగూడ గ్రామంలోని చెరువులో ప్రమిళ ఒడియ (32) మృతి చెందింది. చెరువు వద్ద స్నానం చేయడానికి వెళ్లిన ఆమె మునిగిపోతూ కేకలు వేయడంతో సమీపంలోని పొలంలో ఉన్నవారు గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. దీంతో వెంటనే అగ్నిమాపక సిబ్బందిని పిలిచారు. వారు చెరువు వద్దకు చేరుకొని నీటిలో మునిగిపోయిన ప్రమిళను బయటకు తీశారు. అయితే ఆమె అప్పటికే మృతి చెందింది. దీంతో మత్తిలి ఐఐసీ దేవ్‌దత్త్ మల్లిక్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని, పోస్టు మార్టం నిమిత్తం తరలించారు.

గోపాల్ సమాజ్ బలోపేతం చేయాలి



గోపాల్ సమాజ్ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

జయపురం: గోపాల్ సమాజ్‌ను బలోపేతం చేయాలని జయపురం యాదవ భవనంలో జరిగిన గోపాల సమాజ్ సమావేశంలో సభ్యులు నిర్ణయించారు. సమాజ్ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర పాత్రో అధ్యక్షతన జరిగిన సమావేశంలో అన్నిచోట్ల గోపాల్ సమాజ్‌లు ఏర్పాటు చేసి సభ్యులను చేర్చేందుకు ఉద్యమించాలని తీర్మానించారు. సమావేశంలో గోపాల్ సమాజ్ జయపురం శాఖ అధ్యక్షుడు భాస్కర చంద్ర గౌడ, కార్యదర్శి మోనొ నాయిక్, కోశాధికారి నారాయణ గౌడ, గోపాల్ సమాజ్ జిల్లా కార్యదర్శి రాజేంద్ర కుమార్ గౌడ, సలహాదారు డాక్టర్ సుదర్శన్ గౌడ, గోపాల సమాజ్ మహిళా విభాగ అధ్యక్షురాలు కవిత మహంకుడో తదితరులు పాల్గొన్నారు.

యువకుడిని రక్షించిన ఉపాధ్యాయుడు



ఉపాధ్యాయుడు గాంగ మడ్కమి

మల్కన్‌గిరి: జిల్లాలోని కోరుకొండ సమితి పాత చిమటాపల్లి పంచాయతీ కతపల్లి గ్రామానికి చెందిన మూక అనే యువకుడు గురువారం ఉదయం బైక్‌పై వస్తుండగా సుర్లుకొండ గ్రామం వద్దనున్న బ్యారేజీ వద్ద అదుపుతప్పి నీటిలో పడిపోయాడు. అయితే అదే సమయంలో స్కూల్‌కి వెళ్తున్న ఉపాధ్యాయుడు గాంగ మడ్కమి వెంటనే నీటిలో దూకి ఆ యువకుడిని రక్షించారు. బయటకు తీసుకొచ్చిన వెంటనే అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో కోరుకొండ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రస్తుతం యువకుడు ఆరోగ్యంగా ఉన్నాడని డాక్టర్లు తెలియజేశారు. కాపాడిన ఉపాధ్యాయుడిని అందరూ అభినందించారు.

ప్రతిబాద్ దివాస్



కాశీనగర్‌లో ఆందోళన చేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: గజపతి జిల్లా కాశీనగర్‌లో అఖిల భారత కిసాన్ మోర్చా, ఆదివాసీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ప్రతిబాద్ దివాస్ చేపట్టారు. 2020లో ఉత్తర్‌ప్రదేశ్‌లోని లక్ష్మీపూర్ ఖేరీ గ్రామంలో రైతులు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు నల్లచట్టాలుపై శాంతియుత ఆందోళన చేస్తుండగా, కేంద్రమంత్రి అజయ్ మిశ్రా కుమారుడు జీపుతో తొక్కించాడు. ఈ ఘటనలో నలుగురు రైతులతో పాటు ఒక జర్నలిస్టు మృతి చెందారు. దీనిపై కాశీనగర్ అఖిల భారత కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ కార్యదర్శి కేదార్ శబర, బ్లాక్ అధ్యక్షుడు శోంబోర్ శబర, జిల్లా రైతు కూలీ సంఘం సభ్యులు ఆర్.లోకనాథం, చైతన్య పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



నెక్కంటికి స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు



నెక్కంటికి జ్ఞాపికను అందిస్తున్న మహిళలు

రాయగడ: బీజేడీ పార్టీని రానున్న రోజుల్లో మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు పిలుపునిచ్చారు. జిల్లాలోని గుడారి, పద్మపూర్‌లో గురువారం పర్యటించారు.

ఈ సందర్భంగా ఆయనకు మహిళలు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ బీజేడీ పార్టీ కొత్త వ్యూహాలతో ముందుకు సాగాలన్న ఉద్దేశంతో పార్టీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ ఇచ్చిన పిలుపు మేరకు పాదయాత్రలు జిల్లాలో విజయవంతం చేయాలన్నారు. ప్రతీ కార్యకర్త పార్టీలో కొత్త సభ్యులను చేర్పించే విషయంలో చురుగ్గా పాల్గొనాలని కోరారు. రాష్ట్రానికి గత 25 ఏళ్లు సేవలందించిన నవీన్ పట్నాయక్‌కు ప్రజలు ఇప్పటికీ నీరాజనాలు పలుకుతున్నారన్నారు. కొన్ని అనివార్య కారణాల వల్ల రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిందే తప్పా, ప్రజల్లో ఆ పార్టీకి ఏమాత్రం ఆదరణ లేదన్నారు. సమావేశంలో వందలాది కార్యకర్తలు పాల్గొన్నారు. ఆ పార్టీ సీనియర్ నాయకులు గోదావరి రౌత్, రమాకాంత మాఝి తదితరులు ప్రసంగించారు.

మల్కన్‌గిరిలో బీజేడీ పాదయాత్ర



పాదయాత్రలో పాల్గొన్న దేవి ప్రసనో మిశ్రో తదితరులు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలో బీజేడీ పాదయాత్రను ఆ పార్టీ రాష్ట్రస్థాయి కోర్ కమిటీ చైర్మన్ దేవి ప్రశానో మిశ్రో ప్రారంభించారు. స్థానిక బస్టాండ్ నుంచి స్టేడియం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సాంస్కృతిక భవనం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. అధికారంలో ఉన్నప్పుడు విజయవంతమైన పథకాలను వివరించారు. జిల్లాలో గిరిజనుల అభివృద్ధికి బీజేడీ ఎంతో కృషి చేసిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నవరంగ్‌పూర్ మాజీ ఎంపీలు ప్రదీప్ మాఝి, రమేష్ మాఝి, డబ్బుగాం ఎమ్మెల్యే మనోహర్ రన్ధరి, మల్కన్‌గిరి మాజీ ఎమ్మెల్యే మానాస్ మడ్కమి తదితరులు పాల్గొన్నారు.



బహిరంగ సభకు హాజరైన గిరిజనులు



పాదయాత్రలో సాంస్కృతిక నృత్యాలు

ఆక్రమణల కూల్చివేత

పర్లాకిమిడి: జిల్లాలోని గుసాని సమితిలో తహసీల్దార్ నారాయణ బెహరా, గురండి పోలీసు అధికారి ఐఐసీ రబీంద్ర పాత్రోల ఆధ్వర్యంలో ఆక్రమణలను కూల్చివేశారు. గుసాని సమితిలో పెద్ద గుసాని మౌజాలో ఒక వ్యక్తి ప్రభుత్వ స్థలంలో షెడ్డు వేసి ఆక్రమణలకు పాల్పడ్డాడు. అయితే జిల్లా అధికారులు ఆ మౌజాలో ఒక హెల్త్ క్లినిక్ నిర్మించడానికి ప్రభుత్వ అనుమతి పొందారు. దీంతో గురువారం ఉదయం పోలీసు అధికారుల సాయంతో తహసీల్దార్ సమక్షంలో ఆక్రమణలను కూల్చివేశారు.

షూలో దూరి.. కాటువేసి



షూ నుంచి బయటకు వస్తున్న పాము

భువనేశ్వర్: షూలో దూరిన విషసర్పం కాటువేసిన ఘటన స్థానిక చొక్లైసియాని ప్రాంతంలో గురువారం చోటు చేసుకుంది. షూ తొడిగేందుకు పట్టుకోబోగా యువకుడి చేతికి కాటేసింది. ఈ ఘటనలో పాటుకాటుకు గురైన సునీల్‌ని తక్షణమే క్యాపిటల్ ఆస్పత్రిలో చేర్చారు. స్థానికుల సమాచారంతో స్నేక్ హెల్ప్ లైన్ ప్రధాన కార్యదర్శి సువేందు మల్లిక్ ఘటనా స్థలానికి వచ్చి పామును అదుపులోకి తీసుకున్నాడు. దీని పొడవు 1 అడుగు ఉన్నట్లు తెలిపాడు.

అధికారుల కోసం ప్రజల నిరీక్షణ



అధికారులు లేక ఖాళీగా ఉన్న కుర్చీల ఎదుట కూర్చున్న వేతనదారులు

సారవకోట: మండలంలోని కిన్నెరవాడ సచివాలయంలో గురువారం నిర్వహించిన ఉపాధి హామీ గ్రామసభకు అధికారుల రాక కోసం ప్రజలు నిరీక్షించారు. గ్రామసభ 11 గంటలకు జరుగుతుందని వేతనదారులకు తెలియజేయగా పలువురు సచివాలయానికి హాజరయ్యారు. అయితే గ్రామసభ నిర్వహించాల్సిన పంచాయతీ కార్యదర్శి హిమబిందు 12.30 గంటలకు రావడంతో వేతనదారులు నిరీక్షించాల్సి వచ్చింది. అయితే తాను కిన్నెరవాడ సచివాలయానికి ఇన్‌చార్జ్‌గా విధులు నిర్వర్తిస్తున్నందున లక్ష్మీపురంలో గ్రామసభ నిర్వహించుకుని వచ్చేటప్పటికీ ఆలస్యం అయినట్లు ఆమె తెలిపారు.

ఆశా కార్యకర్తల ఆందోళన



ఏడీఎం భాస్కరరైతాకు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయగడ: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జిల్లా ఆశా కార్యకర్తల సమన్వయ సంఘం ఆందోళన చేపట్టింది. ఈ మేరకు గురువారం ఒక వినతిపత్రాన్ని జిల్లా అదనపు మేజిస్ట్రేట్ భాస్కరరైతాకు సమర్పించారు. భారతీయ మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యంలో జరిగిన ఆందోళన కార్యక్రమంలో సంఘ్ జిల్లా అధ్యక్షుడు జోగేశ్వర్ దాస్ నేతృత్వంలో ఆశా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈనెల 24వ తేదీలోగా సమస్యలను పరిష్కరించకపోతే కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, లేకపోతే నెలవారీ జీతం రూ.18 వేలు చెల్లించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

వసతులు నిల్.. మోసాలు ఫుల్

- పెట్రోల్ బంకుల వద్ద వసతులు కరువు
- కనీస ప్రమాణాలు పాటించని బంకు యజమానులు
- పట్టించుకోని అధికారులు



శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని పలు పెట్రోల్ బంకులు మోసాలకు కేరాఫ్‌లుగా మారుతున్నాయి. దీనికి తోడు కనీస సదుపాయాలు కూడా కల్పించడం లేదు. ప్రజలు పట్టించుకోకపోవడం, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వారి ఆగడాలు సాగిపోతున్నాయి. నిబంధనలు పాటించని వారి వల్ల అందరికీ చెడ్డపేరు వస్తోంది.

మోసాలు ఇలా..

జిల్లాలో 127 పెట్రోల్ బంకులు ఉండగా.. అందులో కొన్ని పెట్రోల్ బంకుల్లో ఇంధనం కల్తీపై ఎప్పటి నుంచో ఆరోపణలు వినిపిస్తున్నాయి. శ్రీకాకుళంలో ఓ బంకు వద్ద ఇలాంటి పరిస్థితి ఎదురుకాగా ఉన్నతాధికారుల వరకు విషయం వెళ్లింది. జలుమూరు మండలంలో ఒక పెట్రోల్ బంక్ వద్ద అయితే జనమే నిరసన తెలిపారు. దీనికి తోడు కొలతలపైనా చాలా అనుమానాలు ఉన్నాయి. ముందుగా చెల్లించిన డబ్బుకి ఫీడ్ చేసి ఆయిల్ నింపుతారు. దీని వల్ల కూడా స్పీడు ఎక్కువగా పెట్టడం, పాయింట్ ఆయిల్ విడుదల కంటే ఎక్కువగా మీటరు రీడింగ్ చూపించడం జరుగుతున్నాయి. దీనికి బంక్ యజమానులు వేరే కారణాలు చెబుతున్నా వినియోగదారుడు మాత్రం నష్టపోతున్నాడు.

వసతులు లేవు..

పెట్రోల్ బంకుల్లో వసతులు భూతద్దం పెట్టి వెతికినా కనిపించవు. మరుగుదొడ్లు ఏర్పాటు చేసిన వాటికి తాళాలు వేసేస్తున్నారు. వినియోగదారులకు సేవలు అందడం లేదు. టైర్లకు గాలి పెట్టే మెషీన్లు ఉన్నా.. అక్కడ ఎవరినీ పెట్టడం లేదు. ఫైర్ అయినప్పుడు ప్రమాదం నుంచి తప్పించుకునేందుకు తొలి ప్రయత్నంగా వాడే ఫైర్ సేఫ్టీలు, అలాగే అక్కడ ఉండే వారికి ఇబ్బంది, అక్కడకు వచ్చే కస్టమర్లకి సేవలు అందించేందుకు ప్రథమ చికిత్స కిట్లు, ఫిల్టర్ పేపర్ లాంటివి ఏర్పాటుచేయాల్సి ఉన్నా.. ఏవీ కనిపించవు. తాగునీరైనా పెట్టని వారు ఎంతో మంది ఉన్నారు.

పర్యవేక్షణ కరువు..

పెట్రోల్ బంకులపై నిరంతరం పర్యవేక్షణ చేయాల్సిన సివిల్ సప్లై అధికారులు, తూనికలు కొలతల అధికారులు, విజిలెన్సు అధికారులు, ఫైర్ ఇతర అధికారులు పర్యవేక్షణ చేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో బంకు యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

చట్టాలు కఠినంగా ఉన్నాయి



వినియోగదారులకు చట్టాలు అనుకూలంగా ఉన్నాయి. బంకు యజమానులు వినియోగదారుడిని మోసం చేస్తే, వెంటనే ఫిర్యాదు చేయాలి. ప్రధానంగా ఈ ఫిర్యాదు సివిల్ సప్లై అధికారులు, తూనికలు కొలతల అధికారులు, వినియోగదారులు సమాఖ్యకు, లేదా నేరుగా వినియోగదారులు న్యాయస్థానంలో ఫిర్యాదు చేయాలి.

– బగాది రామ్మోహన్ రావు, జిల్లా వినియోగదారులు సమాఖ్య అధ్యక్షుడు

వికసిత్ భారత్ లక్ష్యంగా గ్రామసభలు



శిక్షణ పొందినవారికి ప్రశంసాపత్రాలు అందజేస్తున్న అధికారులు



గుమ్మా బ్లాక్ ఉఖురా గ్రామంలో అవగాహన ర్యాలీ

పర్లాకిమిడి: గజపతి జిల్లాలోని ఐదు పంచాయతీల్లో జన యోజన పథకంలో భాగంగా వికసిత్ గ్రామసభలు నిర్వహించడానికి పంచాయతీ రాజ్ అధికారులు ప్రజలకు శిక్షణ అందజేశారు. గుమ్మా బ్లాక్‌లో ఉఖురా, బోడోకోలాకోట్, ఆర్.ఉదయగిరి బ్లాక్‌లో మహేంద్రగడ, ఛెలిగడ గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి, పీపుల్స్ ప్లాన్ అమలు చేశారు. గ్రామ పంచాయతీల్లో రోడ్లు, ప్రాథమిక విద్య, ఇతర మౌలిక సమస్యలపై గ్రామసభలు ఎంతైనా అవసరమని జిల్లా పంచాయతీ అధికారి అశోక్ కుమార్ పట్నాయక్ అన్నారు. ఈ శిక్షణ శిబిరాల అనంతరం గ్రామసభలు నిర్వహించిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. వికసిత్ భారత్ జన యోజన సభల్లో పిరమిల్ ఫౌండేషన్ అధికారి దేబబ్రత ఆచార్య, ప్రేమ్ స్వచ్ఛంద సంస్థ అధికారులు, గ్రామ పంచాయతీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని ఆందోళన



ఏడీఎం రాజేంద్ర మింజ్‌కు సమస్యలు వివరిస్తున్న దృశ్యం



లైలై పంచాయతీలో రోడ్డు దుస్థితి

పర్లాకిమిడి: గజపతి జిల్లాలోని రాయఘడ సమితి ఎస్.కోరడాసింగి, లైలై, బిషులి గ్రామ పంచాయతీల్లో సమస్యలు పరిష్కరించాని ఆయా గ్రామాల మహిళలు కోరారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయం వద్ద గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అరవై ఏళ్లుగా ఎస్.కోరడాసింగి, లైలై పంచాయతీల్లో తాగునీరు, రోడ్డు సౌకర్యం లేకపోవడం వలన వర్షాకాలంలో రాయఘడ ఆస్పత్రికి వెళ్లలేకపోతున్నామని అదనపు జిల్లా మేజిస్ట్రేట్ రాజేంద్ర మింజ్ వద్ద మొరపెట్టుకున్నారు. జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్ అత్యవసర సమావేశానికి వెళ్లడంతో మూడు పంచాయతీల ప్రజలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సిద్ధేశ్వర మిశ్రా, బిభూతీ భూషణ్ హోత్రాతో కలిసి ఏడీఎం రాజేంద్ర మింజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతి చేస్తామని హెచ్చరించారు.

స్వచ్ఛతా హీ సేవ



ప్రజలకు డస్ట్‌బిన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే రూపబొత్ర

జయపురం: కోట్‌పాడ్ సమితి సునారబెలి నువాగం పంచాయతీ నువాగాం గ్రామంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో కోట్‌పాడ్ ఎమ్మెల్యే రూపబొత్ర ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2014లో ప్రారంభించిన స్వచ్ఛ భారత్ మిషన్ 10 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం చేపడుతున్నట్లు వెల్లడించారు. ఎస్‌టీ నువాగాం సర్పంచ్ దేవ్ మఝి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కుంద్ర బీడీవో బిక్రమ దొర, నవరంగపూర్ ఎంపీ ప్రతినిధి రామేశ్వర జెన, జిల్లా పరిషత్ సభ్యులు గీతా మఝి, త్రిపతి చలాన్, సమితి సభ్యురాలు శ్రీదేవి భొత్ర, పంచాయతీ ఎన్నికల అధికారి తపన్ కుమార్ పతి, సమితి కో–ఆర్డినేటర్ భాస్కర పట్నాయిక్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు గ్రామంలో స్వచ్ఛ భారత్ నిర్వహించి, ప్రజలకు డస్ట్ బిన్లు అందజేశారు.

బాణాసంచా పేలుడు



పోలీసులు జప్తు చేసిన అక్రమ బాణాసంచా

భువనేశ్వర్: కటక్ జిల్లాలో అక్రమ బాణాసంచా శిబిరాలు తామర తంపరగా వెలిసినట్లు ఆరోపణ. ఈ జిల్లా సాలేపూర్ ఠాణా నిశ్చింత కొయిలి మండలం జిగ్నిపూర్ గ్రామంలో ఈ శిబిరాలు అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇక్కడ సంభవించిన బాణాసంచా పేలుడు సంఘటనలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతడిని కటక్ ఎస్సీబీ వైద్య బోధన ఆస్పత్రిలో చేర్చారు. బాధితుడు రబీంద్ర దొలైగా గుర్తించారు. సాలేపూర్ ఠాణా పోలీసులు ఘటన స్థలం సందర్శించి అక్రమ బాణాసంచా తయారీ శిబిరంపై దాడి చేపట్టారు. ఈ శిబిరంలో తయారు చేసిన బాణాసంచాతో అనబంధ సరంజామా జప్తు చేశారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పరుగుపోటీలకు వంగర విద్యార్థి



విద్యార్థి చందును అభినందిస్తున్న హెచ్ఎం రమణమ్మ, ఉపాధ్యాయులు

వంగర: రాష్ట్రస్థాయి 100 మీటర్ల పరుగుపందెం పోటీలకు వంగర జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి కొమరాపు చందు ఎంపికైనట్లు పీడీ బి.కవిత తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో చందు ప్రతిభకనబరచడంతో ఈ పోటీలకు ఎంపిక య్యాడని చెప్పారు. హెచ్ఎం ముద్దాడ రమణమ్మ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులంతా చందును ఈ సందర్భంగా అభినందించారు.

ఉత్తరాంధ్ర క్విజ్ పోటీల విజేత వాగ్దేవి స్టడీ హాల్



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

విజయనగరం: గాంధీ జయంతిని పురస్కరించుకుని నగరంలోని ఏపీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తరాంధ్ర స్థాయి క్విజ్ పోటీల్లో వాగ్దేవి స్టడీహాల్ బృందం విజేతగా నిలిచింది. రెండవ స్థానాన్ని దేవర టీమ్ దక్కించుకోగా..మూడవ స్థానంలో డెంకాడ లైబ్రరీ టీమ్ నిలిచింది. విజేతలకు వరుసగా రూ.4వేలు, రూ.3వేలు, రూ.2వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాలను నిర్వాహకులు అందజేశారు. వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులను ప్రోత్సహించడంలో భాగంగా క్విజ్ పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకుడు శ్రావణ్ తెలిపారు.

తప్పిన ప్రమాదం



కాలువలోకి వెళ్లిన ఆర్టీసీ బస్సు ముందుభాగం

గుర్ల: మండల కేంద్రంలో గురువారం అదుపు తప్పిన బస్సు కాలువలోకి వెళ్లిపోయింది. అయితే అదృష్టవశాత్తు బస్సులో ప్రయాణిస్తున్న వారికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. విజయనగరం నుంచి చీపురుపల్లి వెళ్తున్న ఆర్టీసీ బస్సు గుర్లలోని కెల్ల జంక్షన్ వద్దకు చేరుకోగానే ఒక్కసారిగా రోడ్డు పక్కన ఉన్న కాలువలోకి వెళ్లిపోయింది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న 30 మంది ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. అప్రమత్తమైన డ్రైవర్ చాకచక్యంగా బస్సును కాలువలోకి వెళ్లకుండా నియంత్రించడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

పీఆర్టీయూ జిల్లా కార్యాలయం ప్రారంభం



నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గాదె శ్రీనివాసులు నాయుడు

విజయనగరం అర్బన్: పీఆర్టీయూ జిల్లా కార్యాలయాన్ని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గాదె శ్రీనివాసులు నాయుడు స్థానిక ఉడా కాలనీలో గల సంఘం సీనియర్ సభ్యుడు టీఆర్కే శర్మ భవనంలో గురువారం ప్రారంభించారు. త్వరలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పీఆర్టీయూ బాగా పని చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు వి.రవీంద్రనాయుడు, జనరల్ సెక్రటరీ ఈ.శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.రాంబాబు, బంకపల్లి శివ ప్రసాద్, సంఘం పట్టణ అధ్యక్షుడు చిట్టి రామినాయుడు, రావాడ రామకృష్ణ, దిలీప్, రమేష్, మురళి, మోహన్‌బాబు పాల్గొన్నారు.

పాము కాటుతో వ్యక్తి మృతి



కుమిలి రామకృష్ణ మృతదేహం

గజపతినగరం: మండలంలోని సంత లింగాల వలస గ్రామానికి చెందిన కుమిలి రామకృష్ణ(56) పాముకాటుకు గురై మృతి చెందినట్లు ఎస్సై కె.లక్ష్మణరావు గురువారం సాయంత్రం విలేకరులకు తెలిపారు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. లింగాలవలస గ్రామం సమీపంలో తన పొలంలో పండించిన పత్తిపంటకు మందు కొడుతుండగా పాము కాటువేయడంతో అస్వస్థతకు గురయ్యా డు. ఈ విషయం తెలుసుకున్న భార్య అప్పలసూరప్పమ్మ, కుమారుడు శ్రీను గజపతినగరం ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్యసేవలు పొందినప్పటికీ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు వివరా లు నమోదు చేసి కేసు దర్యా ప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఆరిపోతున్న ఆశాదీపాలు



ఇటీవల మృతిచెందిన విద్యార్థులు

- పిట్టల్లా రాలిపోతున్న చిన్నారులు
- గిరిజనులకు తప్పని కడుపుకోత
- జిల్లాలో వ్యాధుల విజృంభణ

సాక్షి, పార్వతీపురం మన్యం: ఆశ్రమ పాఠశాలల్లో మరణ మృదంగం కొనసాగుతోంది. కొద్ది నెలలుగా సీజనల్ వ్యాధులు విజృంభిస్తూ..పాఠశాలల్లో చిన్నారులు పిట్టల్లా రాలిపోతున్నా.. అధికార యంత్రాంగంలో చలనం రావడం లేదు. ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఊదరగొడుతున్నా..పిల్లల మరణాలు ఆగకపో వడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

మూడు నెలల్లోనే ఐదుగురు విద్యార్థులు..

ఈ ఏడాది జులై 6న జియ్యమ్మవలస మండలానికి చెందిన రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బి.ఈశ్వరరావు మృతి చెందాడు. అదే నెల 22న పార్వతీపురం మండలంలోని రావికోన ఆశ్రమ పాఠశాలకు చెందిన పి.రాఘవ అనే ఆరో తరగతి విద్యార్థి సెరిబ్రల్ మలేరియాతో కన్నుమూశాడు. గుమ్మలక్ష్మీపురం మండలం వంగరకు చెందిన నాలుగో తరగతి విద్యార్థి ఎం.గౌతమ్ మలేరియాతో ప్రాణాలు వదిలాడు. తాజాగా రెండు రోజుల్లో ఇద్దరు గిరిజన విద్యార్థులు మృతిచెందారు. గత మంగళవారం కొమరాడ మండల కేంద్రంలోని కేజీబీవీలో తొమ్మిదో తరగతి చదువుతున్న కద్రక శారద..బుధవారం గుమ్మలక్ష్మీపురం మండలం పి.ఆమిటి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న నిమ్మల అవంతి డెంగీతో ప్రాణాలు వదిలారు. నిత్యం జిల్లాలో గిరిజన విద్యార్థులు మరణిస్తున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఫలితంగా ఆ తల్లిదండ్రులకు కడుపుకోత తప్పడం లేదు. జ్వరాలు, సీజనల్ వ్యాధులు కేవలం విద్యార్థులనే కాదు. పెద్దవారినీ కబళిస్తున్నాయి. గడిచిన ఆగస్టు నెలలో జియ్యమ్మవలస మండలం బిత్రపాడు పంచాయతీ బట్లభద్ర గ్రామానికి చెందిన తల్లీకుమార్తెలు దుర్గమ్మ(49), చైతన్య(20) జ్వరంతో కన్నుమూశారు. సీతానగరం మండలంలోని పూనుబుచ్చింపేటకు చెందిన జి.సాయికుమారి(18) జ్వరంతో బాధ పడుతూ మృతి చెందింది. ఇవి కొన్ని ఘటనలు మాత్రమే. ఇలా నిత్యం ఏదో ఒక చోట సీజనల్ వ్యాధుల కారణంగా మరణాలు సంభవిస్తున్నాయి. జిల్లా, ఏరియా ఆసుపత్రులన్న తేడా లేకుండా జ్వరపీడితులతో ఆస్పత్రులన్నీ కిటకిటలాడుతున్నాయి.

అప్‌గ్రేడ్ కాని జిల్లా ఆస్పత్రి

ఇటీవల మృతి చెందిన విద్యార్థినికి ప్లేట్‌లెట్లు పడిపోయాయి. మూడు రోజులు జిల్లా ఆస్పత్రిలో చికిత్స అందించి..విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. అప్పటికే ఆమె పరిస్థితి విషమించింది. జిల్లాకు పెద్ద దిక్కుగా ఉన్న ఆస్పత్రికి బ్లడ్‌బ్యాంక్ పూర్తిస్థాయిలో అప్‌గ్రేడ్ చేయలేదు. ఎంతో మందికి ప్లేట్‌లెట్లు తగ్గిపోతున్న సమయంలో సరైన చికిత్స అందించలేక విజయనగరం, విశాఖపట్నం రిఫరల్ చేయాల్సి వస్తోంది. ఎంఆర్ఐ స్కాన్ వంటి సౌకర్యాలూ ఇక్కడ లేవు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు కొద్దిరోజులుగా పడకేశాయి. సరైన వైద్యం అందకపోవడంతోనే ఎక్కువ మరణాలు సంభవిస్తున్నాయని ప్రజా సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంగా మన్యం అభివృద్ధి చెందినప్పటికీ..ఇంకా అత్యవసర కేసులను ఇతర ప్రాంతాలకు రిఫరల్ చేయడం బాధాకరమని వాపోతున్నారు. మృతిచెందిన విద్యార్థుల కుటుంబాలకు రూ.5 లక్షలు చొప్పున పరిహారం చెల్లించాలి.. మృతికి గల కారణాలు తెలుసుకుని, నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

జిల్లాలో 55 వరకు ఆశ్రమ పాఠశాలలున్నాయి. రెండు ఐటీడీఏలకు రెగ్యులర్ పీవోలు లేకపోవడం..అధికారుల కొరత.. సరిపడా నిధులు మంజూరు కాకపోవడం.. వెరసి పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడుతోంది. జిల్లాకు చెందిన మంత్రి సంధ్యారాణి.. బాధ్యతలు చేపట్టగానే మొదటి సంతకం ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంల నియామకంపైనే చేశారు. ఇప్పటికీ అది ఆచరణలోకి రాలేదు. పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి నిత్యం రోగుల తాకిడి అధికంగా ఉంటున్నా..అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలమవుతున్నారు. కొద్ది రోజుల క్రితం రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ జిల్లా ఆస్పత్రిని సందర్శించి..సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. పలు అదనపు సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అందులో ఏ ఒక్కటీ ఇప్పటి వరకు ఆచరణలోకి రాలేదు.

గిరిజన విద్యార్థుల మృతిపై సమగ్ర దర్యాప్తు: ఏఐఎస్ఎఫ్ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవి కుమార్

పార్వతీపురం టౌన్: జిల్లాలో గిరిజన విద్యార్థుల మృతిపై సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవి కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం ఆయన స్థానిక గిరిజన సామాజిన భవనంలో మాట్లాడుతూ పార్వతీపురం జిల్లాలో ఇద్దరు గిరిజన విద్యార్థినులు రెండు రోజుల వ్యవధిలో మృతి చెందడం ఎంతో బాధాకరమన్నారు. కొమరాడ మండల కేంద్రంలోని కేజీబీవీలో చదువుతున్న శారద, గుమ్మలక్ష్మీపురం మండలం కె.శివడ గిరిజన సంక్షేమబాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న అవంతి మృతి చెందారన్నారు. దీన్ని బట్టి గిరిజన విద్యార్థుల పట్ల ప్రభుత్వం వైఖరి ఏమిటో పూర్తిస్థాయిలో అర్థమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజన శాఖ మంత్రి మొదటి సంతకం ఏఎన్ఎంల పోస్టులపై పెట్టినప్పటికీ ఇంతవరకు పూర్తిస్థాయిలో ఆ పోస్టులు భర్తీ ర్తీ చేసే పరిస్థితి ఎక్కడా కనిపించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల కూడా ఇలా జరుగుతున్నాయన్నారు. తక్షణమే సమగ్ర విచారణ జరపాలని ప్రభుత్వాన్ని కోరారు. పూర్తిస్థాయిలో ఏఎన్ఎం పోస్టులు భర్తీ చేయాలని, లేనిపక్షంలో భవిష్యత్తులో గిరిజన శాఖ మంత్రి కార్యాలయాన్ని విద్యార్థులతో కలిసి ముట్టడికి పిలుపునిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు చేరువగా పోలీస్ వెబ్‌సైట్

- పోస్టర్ ఆవిష్కరించిన ఎస్పీ వకుల్ జిందాల్



పోలీస్ కొత్త వెబ్‌సైట్ లాంచింగ్ పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్ తదితరులు

విజయనగరం క్రైమ్: సాంకేతికతను వినియోగించుకుని జిల్లా పోలీస్‌శాఖను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు గానూ జిల్లా పోలీస్‌శాఖకు సంబంధించి ప్రత్యేక వెబ్‌సైట్‌ను ఎస్పీ వకుల్ జిందాల్ గురువారం తన కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పోలీసు శాఖ చేపడుతున్న వివిధ కార్యక్రమాలు, నిర్వహిస్తున్న విధులు, అందిస్తున్న సేవలను వెబ్‌సైట్‌లో ప్రజలకు తెలియజేస్తామన్నారు. జిల్లా పోలీసుశాఖ నిర్మాణం, జిల్లాలో వివిధ పోలీసుస్టేషన్‌ల అధికారుల ఫోన్‌నంబర్లు, గ్రీవెన్స్‌సెల్ ఫిర్యాదులు, జిల్లా పోలీసుశాఖ జారీచేసే వివిధ సర్టిఫికెట్స్ కోసం మీసేవలో చేసుకున్న దరఖాస్తుల ప్రస్తుత స్థితి, పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ స్థితిని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లకుండానే వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. అదేవిధంగా ప్రస్తుతం జరుగుతున్న వివిధ రకాల సైబర్ మోసాలు, నేరాల గురించి, వాటిని నియంత్రించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించడంతో పాటు, ఫిర్యాదుచేయాల్సిన ఫోన్ నంబర్లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని తెలిపారు. జిల్లా ప్రజలు 'విజయనగరంపోలీస్.ఏపీ.జీఓవీ.ఇన్' ద్వారా పోలీస్‌శాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, జాతీయ ఇన్ఫర్మేటిక్ సెంటర్ (ఐటి) డిస్ట్రిక్ట్ డైరెక్టర్ ఆర్.నరేంద్ర, జాయింట్ డైరెక్టర్ ఎ.బాలసుబ్రమణ్యం, స్పెషల్ బ్రాంచ్ సీఐలు ఏవీ.లీలారావు, ఆర్‌వీఆర్‌కే.చౌదరి తదితరులు పాల్గొన్నారు.

విజయనగర ఉత్సవాలు ఘనంగా జరగాలి

- వేదికల వారీగా సమీక్షించిన కలెక్టర్ అంబేడ్కర్



విజయనగరం ఉత్సవాలపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: విజయనగర ఉత్సవాలు జిల్లా అంతటా సంబరంలా జరగాలని కలెక్టర్ డా.బీఆర్.అంబేడ్కర్ పిలుపునిచ్చారు. ప్రతి వేదిక వద్ద జరిగే వేడుకలు ఘనంగా నిర్వహించి పండగ వాతావరణం ఉట్టి పడేలా ఉండాలని సూచించారు. ఈ మేరకు కలెక్టర్ తన చాంబర్‌లో గురువారం స్థానిక శాసన సభ్యురాలు అదితిగజపతిరాజుతో కలిసి..వేదికల ఇన్‌చార్జ్ అధికారులతో కార్యక్రమాల ఏర్పాట్లపై సమీక్షించారు.. పండగ మూడు రోజులు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. అన్ని ప్రభుత్వ భవనాలు, పార్కులతో లైటింగ్ ఏర్పాటు చేయాలని, ప్రధాన కూడళ్ల వద్ద స్వాగత ద్వారాలను ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. వేదిక వారీగా హాజరయ్యే కళాకారులు, కవులు, నటులు, విద్యార్థులకు అవసరమయ్యే సర్టిఫికెట్లు, మెమెంటోలను ఇండెంట్ పెట్టి తీసుకోవాలని ఇన్‌చార్జ్‌లకు చెప్పారు. సైన్స్ ఫెయిర్‌కు వచ్చే విద్యార్థులకు చక్కటి భోజన వసతిని ఏర్పాటు చేయాలని, ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలగకుండ అందరూ సంతృప్తి చెందేలా ఏర్పాట్లు చేయాలని డీఈఓకు సూచించారు. కోట వద్ద లేజర్ షో, అయోధ్య మైదానంలో రెండు రోజుల పాటు మెగా ఈవెంట్, పెంపుడు జంతువుల ప్రదర్శన (పెట్ షో) ఉంటుందని తెలిపారు. లోయర్ ట్యాంక్ బండ్‌లో ఉన్న మన్సాస్ గ్రౌండ్‌లో డ్వాక్రా ఉత్పత్తుల ప్రదర్శన సర్కస్ ఎగ్జిబిషన్ ఉంటాయని, అదే ప్రాంగణంలో పుష్ప ప్రదర్శన కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కోటలో సైన్స్‌ఫెయిర్, స్టాంప్స్, కాయిన్స్ సేకరణ, ఆర్ట్ గాలరీ ఉంటాయన్నారు.

వేదికల వారీగా ఏర్పాట్లు చేసుకోవాలి

గురజాడ కళాభారతిలో స్థానిక కళాకారులతో నాటకాల ప్రదర్శన, ఏక పాత్రాభినయాలు ఉంటాయని, విజ్జి స్టేడియంలో క్రీడలు, మార్షల్ ఆర్ట్స్ ఉంటాయని వివరించారు. ఆనంద గజపతి ఆడిటోరియంలో స్థానిక కళాకారులతో సంగీత, నృత్య ప్రదర్శనలు, మహారాజా లేడీస్ రిక్రియేషన్ క్లబ్‌లో సాహిత్య గోష్ఠి , కవి సమ్మేళనాలు, అష్టావధానాలు ఉంటాయని, లయన్స్ క్లబ్‌లో జానపద కళాకారులతో వివిధ కళల ప్రదర్శన ఉంటుందని స్పష్టం చేశారు. బొంకుల దిబ్బ వద్ద నాటకాల ప్రదర్శన, కోట వద్ద పులివేషాలు ఉంటాయని తెలిపారు. వేదికల వారీగా నియమించిన ఇన్‌చార్జ్ అధికారులు ముందుగా ఏర్పాట్లు చేసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో డీఆర్‌ఓ అనిత, వేదికల ఇన్‌చార్జ్ అధికారులు పాల్గొన్నారు.

హుండీలో పాత నోట్లు, రోల్డ్‌గోల్డ్ వస్తువులు



నకిలీ నోట్లు, ఆభరణాలను చూపిస్తున్న ఆలయ ఈఓ ప్రసాదరావు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారి చదురుగుడి హుండీల లెక్కింపును అమ్మవారి కల్యాణ మంటపం ఆవరణలో గురువారం నిర్వహించారు. అయితే ఈ సందర్భంగా హుండీల లెక్కింపులో పాత రూ.2వేలు, రూ 500 నోట్లు, నకిలీ కరెన్సీ నోట్లు, రోల్డ్‌గోల్డ్ ఆభరణాలు దర్శనమిచ్చాయని ఆలయ ఈఓ డీవీవీ.ప్రసాదరావు తెలిపారు. హుండీలో ఇటువంటి నోట్లు, ఆభరణాలు వేయకూడదని భక్తులకు ఆయన సూచించారు. మొత్తం 29 రోజులకు సంబంధించి రూ.10 లక్షల 54వేల 690 నగదు, 12 గ్రాముల 100 మిల్లీ గ్రాముల బంగారం, 131గ్రాముల వెండి లభించినట్లు ఈఓ తెలిపారు. రామతీర్థం ఈఓ వై.శ్రీనివాసరావు ప్రత్యేకాధికారిగా హాజరై హుండీల లెక్కింపును పరిశీలించారు. శ్రీవారి సేవకులు, ఆలయ అధికారులు, పోలీస్ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

సెంచూరియన్‌లో ఆప్టోమెట్రీపై సదస్సు



సదస్సులో ప్రసంగిస్తున్న డాక్టర్ కుమారస్వామి

నెల్లిమర్ల రూరల్: ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఆప్టోమెట్రీపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన స్వామి కంటి ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కుమారస్వామి స్వదేశీ బ్రాండ్, ఉత్పత్తి, పరిశోధన, అభివృద్ధిని సృష్టించడం తదితర ముఖ్య అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య



ఉరివేసుకున్న ఆటో డ్రైవర్ నందేశ్వరరావు

సాలూరు రూరల్: పాచిపెంట మండలంలోని చొక్కాపువాని వలస గ్రామానికి చెందిన కోట నందేశ్వరరావు(21) సాలూరు మండలంలోని జీగిరాం గ్రామంలో గల మామిడి తోటలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు రూరల్ ఎస్సై వెంకటరమణ గురువారం తెలిపిన వివరాల ప్రకారం భార్యాభర్తల మధ్య వివాదమే ఆత్మహత్యకు కారణమైంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.

అంతర్జాతీయ స్నాతకోత్సవంలో ప్రసాద్‌కు సత్కారం



కేంద్ర సహాయ మంత్రి అశ్వనీకుమార్ చౌబే చేతుల మీదుగా సత్కారం అందుకుంటున్న ప్రసాద్

చీపురుపల్లి: ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ అంతర్జాతీయ స్నాతకోత్సవంలో పట్టణానికి చెందిన శ్రీనివాసా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఏడీఎన్ఎస్‌వీ ప్రసాద్‌కు సత్కారం లభించింది. గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న ఢిల్లీలో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్నాతకోత్సవంతోపాటు త్రీడి సెల్ఫీ సైన్స్ మ్యూజియం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రపంచ వ్యాప్తంగా గాంధీజీపై విడుదలైన తపాళా బిల్లలను(స్టాంప్స్)ను సేకరించినందుకు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ప్రసాద్ స్థానం సంపాదించారు. అక్టోబర్ 2న ఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ స్నాతకోత్సవంలో కేంద్ర అటవీ, ఆహారం, ప్రజాపంపిణీ సహాయ మంత్రి అశ్వనీకుమార్ చౌబే చేతులమీదుగా సత్కారాన్ని పొందారు. దీంతో స్థానిక కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది అభినందించారు.

2800 కేజీల పీడీఎస్ బియ్యం పట్టివేత

చీపురుపల్లి: పట్టణంలోని మూడు రోడ్ల జంక్షన్‌లో నిర్వహించిన వాహన తనిఖీల్లో భాగంగా ప్రజా పంపిణీ వ్యవస్థకు చెందిన బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్న మూడు వాహనాలను, వాటిలో ఉన్న 2,800 కేజీల పీడీఎస్ బియ్యం సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్.దామోదర్ చెప్పారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ ఉదయం 5 గంటల నుంచి 7 గంటల సమయంలో కానిస్టేబుల్స్ ఎం.గోవింద, ఎం.భానూజీరావుతో కలిసి పట్టణంలోని మూడు రోడ్ల జంక్షన్‌లో వాహనాల తనిఖీ చేపట్టినట్లు చెప్పారు. అదే సమయంలో రాజాం నుంచి బొలెరో వ్యాన్‌లో దాదాపు 2 వేల కేజీలు బియ్యాన్ని తెర్లాం మండలంలోని వెలగవలస గ్రామానికి చెందిన గేదెల కృష్ణ అనే డ్రైవర్, ఎచ్చెర్ల వైపు నుంచి టాటా మ్యాజిక్ వాహనంలో దాదాపు 500 కేజీలు బియ్యాన్ని ఎచ్చెర్లకు చెందిన మునకల రామిరెడ్డి, చీపురుపల్లి మండలంలోని మెట్టపల్లి గ్రామానికి చెందిన పొదిలాపు గొల్లబాబు ఆటోలో 300 కేజీలు బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. దీంతో ఆ మూడు వాహనాలతో బాటు బియ్యం సీజ్ చేసి కేసులు నమోదు చేశామని వివరించారు.

100 మద్యం బాటిల్స్ పట్టివేత

బలిజిపేట: మండలంలోని అంపావల్లి గ్రామానికి చెందిన పెర్లి పురుషోత్తమరావు బలిజిపేట నుంచి అక్రమంగా తరలిస్తున్న 100 మద్యం సీసాలను ఎస్సై సింహాచలం గురువారం పట్టుకున్నారు. ఈ మేరకు ఆయన తెలిపిన వివరాల ప్రకారం బలిజిపేటలోని వివిధ షాపుల్లో కొనుగోలు చేసిన 100 మద్యం సీసాలు అక్రమంగా తరలిస్తుండగా బలిజిపేట, చిలకలపల్లి మార్గమధ్యంలో ఉన్న గ్యాస్ గొడౌన్ వద్ద వాటిని పట్టుకున్నారు. వాహనాల తనిఖీల్లో మద్యం సీసాలు దొరికినట్లు తెలిపారు. అనంతరం నిందితుడిపై కేసునమోదుచేసినట్లు ఎస్సై చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యంతరాలుంటే తెలియజేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ కేశవనాయుడు

పార్వతీపురం: ఓటరు జాబితాకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ జి. కేశవనాయుడు రాజకీయ పార్టీ ప్రతినిధులను కోరారు. ఈ మేరకు గురువారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటింటికి ఓటరుజాబితా తనిఖీ చేశామని, జిల్లాలో 7,83,972 మంది ఓటర్లు ఉండగా, వారిలో 7,82,260 మంది ఓటర్లను ధ్రువీకరించామని తెలిపారు. బలిజిపేట మండలం రాయివలస, కురుపాం మండలం గొత్తిలి గ్రామంలో పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ఐదు పోలింగ్ స్టేషన్ల లొకేషన్లు, 21 పోలింగ్ కేంద్రాలపేర్లు మార్చేందుకు ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు. 2025 జనవరి 1 నాటికి 18ఏళ్లు నిండిన వారు అక్టోబర్ 29 నుంచి నవంబర్ 21వరకు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వివిధ పార్టీల ప్రతినిధులు పి. శ్రీనివాసరావు, ఎ.శివకుమార్, పి.అప్పారావు, టి.వెంకటరమణ, పి.రాజశేఖర్, ఎస్. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు చేయండి

- జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

విజయనగరం అర్బన్: జిల్లాలో రైతుసేవా కేంద్రాల వారీగా పత్తి రైతుల జాబితాను సిద్ధం చేసి పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ అధికారులను ఆదేశించారు. పత్తి కొనుగోలు ప్రక్రియను ప్రారంభించేందుకు తన చాంబర్‌లో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో నవంబర్ రెండోవారం నుంచి పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, ఈలోగా వాటికి సంబంధించిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాజాం, రామభద్రపురంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రతీరైతు తాము పండించిన పత్తిని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి, కనీస మద్దతు ధర పొందేలా చూడాలని జేసీ కోరారు. పత్తి రవాణాకు అవసరమైన వాహనాలను సిద్ధం చేయాలన్నారు. అగ్నిప్రమాదాలు సంభవించకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. తూనిక యంత్రాలను తనిఖీ చేసి సిద్ధంగా ఉంచాలని జేసీ ఆదేశించారు. సమావేశంలో మార్కెటింగ్ ఏడీ బి.రవికుమార్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి.రామ్‌ప్రకాష్, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ పీవీ రంగారెడ్డి, వ్యవసాయశాఖ ఏడీ అన్నపూర్ణ, మోటార్ వెహిల్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకుంటాం..

- ఆంధ్రప్రదేశ్ రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు
- పార్వతీపురం కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్షలు



నిరసన దీక్షల శిబిరం వద్ద మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి

పార్వతీపురంటౌన్: విశాఖ ఉక్కు పరిశ్రమను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయనున్న ప్రైవేటీకరణ విధానాన్ని అడ్డుకుంటామని రైతు సంఘం పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి అన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా సంఘాల రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా గురువారం పార్వతీపురం మన్యం జిల్లా ఏపీ రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్ ఆఫీస్ ఎదుట నిరసన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి. ప్లాంటుకు సొంత గనులు, వర్కింగ్ కేపిటల్ ఇవ్వాలి. ప్లాంట్‌ను పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడిపించాలి. ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయాలి. నిర్వాసితులకు ఉద్యోగాలివ్వాలి. కార్మికులందరికీ సకాలంలో జీతాలివ్వాలని డిమాండ్ చేశారు.

కూటమి కపట నాటకాలు

విశాఖ ఉక్కు పరిశ్రమపై బీజేపీ కుయుక్తులకు తగినట్లు టీడీపీ, జనసేన కపట నాటకాలు ఆడుతున్నాయని ఆయన విమర్శించారు. స్టీల్ ఉత్పత్తికి ఇనుప ఖనిజంతో పాటు బొగ్గు కావాలని, స్టీల్ ప్లాంటుకు బొగ్గు సరఫరా కాకుండా కుట్రలు చేసింది బీజేపీ, దాని మిత్ర పార్టీలేనని ధ్వజమెత్తారు. మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌ల్లో రెండు మూత పడిపోయాయని, స్టీల్ ప్లాంటులో పనిచేస్తున్న 4000 మంది కార్మికులకు పని నిలిపేసి, ప్లాంటును కార్పొరేట్ మిత్రులకు అమ్మేస్తాం, లేకుంటే పూర్తిగా చంపేస్తామని మోదీ ప్రభుత్వం శపథం చేసిందని, ఇప్పుడు అదే పని చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.

కార్పొరేట్‌కు కట్టబెట్టే ప్రయత్నం

పారిశ్రామిక వేత్తలు అంబానీ, ఆదానీ ప్లాంట్లకు గనులు కేటాయించిన మోదీ ప్రభుత్వం విశాఖ స్టీల్ పరిశ్రమకు ఎందుకు కేటాయించడం లేదని ప్రశ్నించారు. ఏనాటికైనా స్టీల్ ప్లాంట్‌ను కార్పొరేట్ చేతుల్లో తాకట్టు పెట్టాలనే ప్రయత్నం మోదీ ప్రభుత్వం చేపడుతుందని, దీన్ని తీవ్రంగా ఖండించాలని నేటి యువతరానికి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ బంటు దాసు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బి.నర్సింగరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రెడ్డి ఈశ్వరరావు కొల్లి గంగు నాయుడు, అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.సంగం, ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి, ఎం.గౌరి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లి జాతరకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు



సీహెచ్ అప్పలనారాయణ, జిల్లా ప్రజారవాణా అధికారి

విజయనగరం అర్బన్: దసరా, పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవాన్ని పురస్కరించుకొని ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్ సర్వీసులు నడుపుతామని జిల్లా ప్రజారవాణా అధికారి సీహెచ్ అప్పలనారాయణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయనగరం, ఎస్.కోట డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ నెల 4 నుంచి 16వ తేదీ వరకు విశాఖపట్నం-విజయనగరం, విజయనగరం నుంచి బొబ్బిలి, పార్వతీపురం చీపురుపల్లి, అనకాపల్లి తదితర నగరాలకు ప్రతిరోజూ రద్దీకి అనుగుణంగా ప్రత్యేక సర్వీసులు నడుపుతామన్నారు. ఈ నెల 10, 11వ తేదీల్లో హైదరాబాద్ నుంచి విజయనగరానికి ప్రత్యేక సర్వీసులు నడుపుతామని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. apsrtconline.in అనే వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో టికెట్స్ బుక్ చేసుకునే సదుపాయం కల్పించామన్నారు. పూర్తి వివరాలకు సెల్: 99592 25620 (విజయనగరం డిపో మేనేజర్), 94943 31213 (అసిస్టెంట్ మేనేజర్), 73829 21380 (సూపరింటెండెంట్), 73829 23683 (బుకింగ్ సూపర్‌వైజర్), 94403 59596 (సిస్టం సూపర్‌వైజర్) నంబర్లను సంప్రదించాలని కోరారు.